నమస్తే తెలంగాణ

# సూర్యాపేట

5 | నల్లగొండ, బుధవారం 3 జూలై 2024 | SURYAPET




కేసీఆర్‌తో జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన జిల్లా నేతలు

నల్లగొండ/కట్టంగూర్, జూలై 2 : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మంగళవారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నల్లగొండ జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, సూర్యాపేట జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు తమ కుటుంబ సభ్యులతో మర్యాద పూర్వకంగా కలిశారు. జడ్పీ చైర్మన్ల పదవీ కాలం పూర్తవుతున్న సందర్భంగా కేసీఆర్ వారికి శాలువా కప్పి సన్మానించారు. అలాగే నకిరేకల్ మాజీ చిరుమర్తి లింగయ్య కూడా కేసీఆర్‌ను కలిశారు. నియోజకవర్గ పరిస్థితులు, ఇతర అంశాలపై వారు కేసీఆర్‌తో చర్చించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకెళ్లాలని కేసీఆర్ సూచించినట్లు వారు తెలిపారు. అనంతరం బండ నరేందర్ రెడ్డి, గుజ్జ దీపికాయుగంధర్‌రావును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, పైళ్ల శేఖర్ రెడ్డి కూడా సన్మానించారు.



కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



కేసీఆర్‌తో సూర్యాపేట జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు కుటుంబ సభ్యులు

## నేడు, రేపు జిల్లా కార్యాలయాల్లో శానిటేషన్ డ్రైవ్

- నల్లగొండ కలెక్టర్ నారాయణ రెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ, జూలై 2 : అన్ని జిల్లా కార్యాలయాల్లో బుధ, గురువారం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టి పారిశుధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణ రెడ్డి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఆయా శాఖలను శుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అధికారులదేనని తెలిపారు. కలెక్టరేట్ నుంచి ఆయా శాఖల అధికారులతో ఆయన మంగళవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కార్యాలయాల్లో శానిటేషన్ సరిగా ఉండడం లేదని ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆవరణలు శుభ్రంగా ఉంచాలని, ముఖ్యంగా టాయిలెట్లను క్లీన్‌గా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. రాబోయే నాలుగు రోజులు ఈ కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. టాయిలెట్లలో నిరంతరం నీటి సరఫరా, విద్యుత్ సరఫరా, డోర్లు సరిగా ఉండాలని, ఎక్కడైనా అవసరమైతే తక్షణమే మరమ్మతులు చేయించుకోవాలని ఆదేశించారు.

శనివారం నాటికి అన్ని కార్యాలయాలలో పూర్తి పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అంతకుముందు కలెక్టర్ కార్యాలయంలోని సెక్షన్ల విభాగాల అధిపతులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ఉద్యోగులు సమయ పాలన పాటించాలని ఆదేశించారు. ప్రజలకు సంబంధించిన పిటిషన్లను త్వరితగతిన పరిష్కరించాలని, ఫైళ్లు జాప్యం లేకుండా పంపించాలని అన్నారు. అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, టి.పూర్ణచంద్ర, జిల్లా రెవెన్యూ అధికారి డి. రాజ్యలక్ష్మి, కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి మోతీలాల్, జిల్లా ఇన్‌ఫర్మేటిక్ అధికారి గణపతి రావు, ఆయా విభాగాల పర్యవేక్షకులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

## అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

- సూర్యాపేట కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



నూతనకల్ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ నందలాల్ పవార్

నూతనకల్ ; జూలై 2 : అధికారులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. మండలంలో మంగళవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ కార్యాలయం, తాసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పల్లె ప్రకృతి వనం, డంపింగ్ యార్డు, నర్సరీని, గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చిన వెంటనే బయోమెట్రిక్ హాజరు వేసుకోవాలన్నారు. నూతన విద్యా విధానంలో పాఠ్యాంశ ప్రణాళిక తప్పనిసరిగా అనుసరించాలని, ప్రణాళిక లేకుండా బోధన చేయొద్దని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో ఆంగ్లంలో మాట్లాడాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలని, వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో వైద్య సిబ్బంది నిత్యం పర్యటిస్తూ ఆరోగ్య సమాచారం సేకరించాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని అర్హులందరికీ అందించేలా చూడాలన్నారు. పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ఆయన వెంట తాసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ సునీత, ఏఓ మురళి, ఎంఈఓ రాములునాయక్ తదితరులు ఉన్నారు.

### మద్దిరాలలో

మద్దిరాల : మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలు, ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రంలో ప్రజలకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠాలు వింటున్న విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికితీశారు. రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు, మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణ రెడ్డి, ఎంపీఓ రాజేశ్ ఉన్నారు.

# బడి బాటలో బస్సేది?

## ఆర్టీసీ బస్సు సదుపాయం లేక విద్యార్థుల అవస్థలు

- సూర్యాపేట జిల్లాలో నేటికీ సగం గ్రామాలకు ఆర్టీసీ సర్వీసుల్లేవ్
- అనేక పల్లెలకు ఒక్కటే బస్సు
- సైకిళ్లు, ఆటో, ప్రైవేట్ వాహనాలే దిక్కు
- వినతులు అందించినా.. ఆందోళనలు చేసినా పట్టించుకోని అధికారులు
- నల్లగొండ జిల్లాలోనూ ఇదే పరిస్థితి



మఠంపల్లి : బస్సులు లేక ఆటోల కోసం వేచి చూస్తున్న విద్యార్థులు

**ఉమ్మడి జిల్లాలోని అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడువడం లేదు. బస్సెరుగని ఊర్లు ఎన్నో ఉన్నాయి. ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు బడికి వెళ్లేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఆదాయం వచ్చే మార్గాలపైనే ఆర్టీసీ దృష్టి పెట్టడంతో పల్లెలకు బస్సులు రావడం లేదు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లే సమయానికి బస్సులు వేయాలని ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రయోజనం ఉండడంలేదు. చేసేదేం లేక విద్యార్థులు నడుచుకుంటూనో, సైకిళ్లపైనో, ఇతర వాహనాలను లిఫ్ట్ అడిగో వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.**

– సూర్యాపేట, జూలై 2 (నమస్తే తెలంగాణ)

### 50 శాతం గ్రామాలకు బస్సులు పోతలేవ్..

సూర్యాపేట జిల్లాలో సూర్యాపేట, కోదాడ డిపోలు ఉన్నాయి. వీటిల్లో 125 బస్సులు ఉండగా ప్రస్తుతం 118 బస్సులు నడుస్తున్నాయి. వాస్తవానికి ఒక్క బస్సు తగ్గినా ఆ బస్సు తిరిగే రూట్లు దాదాపు 10 నుంచి 15 గ్రామాలు ఉంటాయి. జిల్లా వ్యాప్తంగా గ్రామ పంచాయతీలు, ఆవాసాలు కలిపి 1,335 ఉండగా దాదాపు 50 నుంచి 55 శాతం పల్లెలకు ఆర్టీసీ బస్సు సౌకర్యమే లేదు. గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది గ్రామాలకు పల్లె వెలుగు బస్సులు మరిన్ని తగ్గాయి. ఆయా గ్రామాలకు సరైన రోడ్డు సదుపాయం ఉన్నప్పటికీ బస్సులు మాత్రం రాకపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ ఆదాయంపైనే దృష్టి పెడుతున్నదని, పల్లెలకు బస్సులు నడుపాలనే ఆలోచన చేయడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక కొత్త బస్సుల కేటాయింపు లేనేలేదు. ఉన్న పరిమిత బస్సుల్లో మహా లక్ష్మి పథకం వచ్చాక 98శాతం ఆక్యుపెన్సీ రేషియో నమోదవుతుండటంతో బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. నల్లగొండ జిల్లాలోనూ ఇదే పరిస్థితి ఉంది.

### పట్టించుకోని అధికారులు

గ్రామాలకు బస్సులు రాకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల అసలే బస్సు నడువకపోవడంపై అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఒత్తిడి పెరుగుతున్నది. విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు వినతిపత్రాలు అందిస్తున్నారు. కొన్ని చోట్ల రోడ్లపై ధర్నాలు, ఆందోళనలు చేసి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయినా ఎవరూ పట్టించుకోవడంలేదు.



త్రిపురారం : ఆటోలో స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు

### రెండున్నర కిలోమీటర్లు నడువాల్సిందే..

త్రిపురారం : మండలంలోని కంపసాగర్ మోడల్ స్కూల్‌లో చదువుకోవాలంటే మండల కేంద్రం నుంచి రెండున్నర కిలోమీటర్లు నడవాల్సిందే. బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఆటోలో లేక నడుచుకుంటూ రావాల్సి వస్తున్నది. ఒక్కో విద్యార్థి ఆటో ప్రయాణ ఖర్చులు ప్రతి నెలా రూ.800 నుంచి రూ.1000 చెల్లిస్తున్నారు. ఇంతకుముందు రాగడప గ్రామం నుంచి మండల వ్యాప్తంగా తిరుగుతూ ప్రత్యేకమైన బస్సు సౌకర్యం ఉండేది. కానీ ఆ బస్సు సౌకర్యం తీసివేశారు. అలాగే మండలంలోని చెన్నాయిపాలెం జడ్పీ హైస్కూల్‌కు వెళ్లాలంటే మాటూరు, వస్రాంతండా, సత్యంపాడుతండా, లావూడితండా గ్రామాలకు చెందిన విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



శాలిగౌరారం : తిరుమలరాయినిగూడెంలో బస్సుకోసం ఎదురు చూస్తున్న వల్లాల మోడల్‌స్కూల్ విద్యార్థులు

### బస్సుల కోసం ఎదురుచూపు

శాలిగౌరారం : మండలంలో పాఠశాల సమయానికి బస్సులు రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వచ్చినా సీట్లు ఉండడం లేదు. వల్లాల గ్రామంలో గల మోడల్ స్కూల్‌లో 800మంది విద్యార్థులు చదువుతున్నారు. వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు వస్తుండగా బస్సులు లేక ఆటోల్లో రావాల్సి వస్తున్నది.

### 3 నుంచి 10 కిలోమీటర్లు ఇబ్బందే..

జిల్లాలోని చాలా గ్రామాల్లోని ప్రాథమిక స్థాయి వరకు బడులు కొనసాగుతున్నాయి. దీంతో హైస్కూల్ కోసం 3 నుంచి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఇతర గ్రామాలకు వెళ్లాల్సిన పరిస్థితి. ఇక పెద్ద సంఖ్యలో విద్యార్థులు మండల కేంద్రాల్లోని ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకుంటున్నారు. బస్సులు రాని గ్రామాల నుంచి వారంతా నడుచుకుంటూనో.. సైకిళ్లపైనో వెళ్తున్నారు. మండల కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు ఆటోలపై ఆధారపడుతున్నారు. ఆటోల్లో ప్రయాణం ఒక్కోసారి ప్రాణాల మీదికి తెస్తున్నా తప్పనిసరి పరిస్థితుల్లో ఆశ్రయించాల్సి వస్తున్నది. కొన్ని గ్రామాల్లో ఉదయం, సాయంత్ర వేళల్లో బస్సులు నడుస్తున్నా సకాలంలో రాకపోవడంతో ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వస్తున్నది. ఇలాంటి సమయంలో అమ్మాయిలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు. పాఠశాల వెళ్లే సమయంలో, తిరిగి వచ్చే సమయంలో సాయంత్రం ఆకతాయిలు వికృత చేష్టలకు దిగుతుండటంతో ఇబ్బందులు పడుతున్నారు.

### ఆటో ఎక్కాల్సిందే..

తుంగతుర్తి : సమయానికి బస్సులు లేక పసునూరు మోడల్ స్కూల్ వెళ్లడానికి అన్నారం గ్రామానికి చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం ఏడున్నర వరకే తయారై ప్రతి రోజూ రూ.20 నుంచి 30 వెచ్చించి ఆటో ద్వారా తుంగతుర్తికి చేరుకుంటున్నారు. ఆ తర్వాత తుంగతుర్తి నుంచి 9గంటలకు మాత్రమే వెళ్లే హైదరాబాద్ బస్సు ఎక్కి పసునూరు మోడల్ సూకల్ పాఠశాలకు చేరుకుంటున్నారు.



తుంగతుర్తి : ఉదయాన్నే ఆటో కోసం వచ్చిన పసునూరు మోడల్ స్కూల్ విద్యార్థులు



ఆత్మకూర్ (ఎస్) : నెమ్మికల్ నుంచి ఆత్మకూర్. ఎస్‌కు నడుచుకుంటున్న వస్తున్న విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- పిల్లలతో వెట్టిచాకిరీ చేయిస్తే క్రిమినల్ కేసులు
- ఈ నెల 31 వరకు ఆపరేషన్ ముస్కాన్
- నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్

నీలగిరి, జూలై 2 : నిరాదరణకు గురైన, తప్పిపోయిన, వెట్టి చాకిరీకి గురవుతున్న బాలబాలికలను గుర్తించి వారిని సంరక్షించడం కోసం ప్రతి సంవత్సరం జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నల్లగొండ ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆపరేషన్ ముస్కాన్–10 కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 1 నుంచి 31 వరకు నెల రోజులపాటు పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, లేబర్, ఎడ్యుకేషన్, చైల్డ్ ప్రొటెక్షన్, హెల్త్ డిపార్ట్‌మెంట్లు అధికారుల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్ నిర్వహిస్తామని తెలిపారు. 18సంవత్సరాల్లోపు తప్పిపోయిన, నిరాదరణకు, వివిధ రకాల బాల కార్మికులు ఉన్నట్లయితే అలాంటి వారిని గుర్తించి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి అప్పగించడం లేదా స్టేట్ హోమ్‌కు పంపించడం జరుగుతుందని చెప్పారు. ఎవరైనా బాలల స్వేచ్ఛ, వికాసానికి భంగం కలిగించినా, వెట్టి చాకిరీ చేయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయాల్లో పిల్లలకు సంబంధించిన సమాచారానికి 1,098, 100 నంబర్లకు తెలియజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, ఎస్‌బీడీఎస్పీ రమేశ్, డీసీఆర్‌బీ డీఎస్పీ సైదా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కృష్ణ, డిస్ట్రిక్ట్ వెల్ఫేర్ ఆఫీసర్ సక్కుబాయి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలు రవాణా జరుగకుండా చూడాలి

- సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

కోదాడ, జూలై2 : సరిహద్దు రాష్ట్రాల నుంచి గంజాయి, మత్తు పదార్థాలు వంటివి రవాణా జరుగకుండా చర్యలు తీసుకోవాలని సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ సూచించారు. కోదాడలో మంగళవారం పట్టణ, రూరల్ పోలీస్ స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ కేసులు పెండింగ్‌లో లేకుండా వెంటనే పరిష్కరించాలన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పట్టణ సీఐ రాము, రూరల్ సీఐ రజితరెడ్డి, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐలు అనిల్‌రెడ్డి, మల్లేశ్ పాల్గొన్నారు.



కోదాడలో రూరల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

## నిరుద్యోగుల జీవితాలతో కాంగ్రెస్ సర్కారు చెలగాటం

- డీఎస్సీని వాయిదా వేసి మెగా డీఎస్సీ ప్రకటించాలి
- గ్రూప్ -2, 3లో పోస్టుల సంఖ్య పెంచాలి
- సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించకుంటే రేపు టీజీపీఎస్సీ ముట్టడి
- నిరుద్యోగి లోయపల్లి కృష్ణ



మాట్లాడుతున్న లోయపల్లి కృష్ణ

రామగిరి, జూలై 2 : 'నిరుద్యోగులకు అండగా ఉంటామని, ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వాటిని తుంగలోతొక్కింది. నిరుద్యోగుల జీవితాలతో రేవంత్ సర్కారు చెలగాటమాడుతున్నది' అని ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగి లోయపల్లి కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. 'నమస్తే తెలంగాణ'తో ఆయన మంగళవారం మాట్లాడారు. కాంగ్రెస్ సర్కార్ టెట్ నిర్వహించి వాటి ఫలితాలను జూన్ 9న వెల్లడించిందని, దానిలో అర్హత సాధించిన వారు డీఎస్సీకి సిద్ధం కావడానికి సమయం తక్కువ ఉండటంతో సిలబస్‌ను చదవలేకపోతున్నాని అన్నారు. అందుకే డీఎస్సీని రెండు నెలలు వాయిదా వేసి, పోస్టుల సంఖ్య పెంచి మెగా డీఎస్సీని వేస్తే అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు. మరో వైపు జోనల్ వ్యవస్థతో ప్రస్తుతం వెల్లడించిన గ్రూప్–2, 3 నోటిఫికేషన్స్‌తో పోస్టుల సంఖ్య చాలా తక్కువ ఉందని, వాటిని పెంచాలని చెప్పారు. గ్రూప్స్ ఉద్యోగాల్లో చార్మినార్‌ను ఫ్రీ జోన్ చేస్తే కొంత మందికి న్యాయం జరిగేదని తెలిపారు. గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత శాతం 1:100గా వెల్లడించాలని, ఇలా చేయడంతో ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమీ లేదని చెప్పారు. ఉత్తీర్ణత శాతం పెంచడంతో అభ్యర్థులకు ఊరట కలుగుతుందని, ఎవరికి ప్రతిభ ఉందో వారికే ఉద్యోగాలు వస్తాయని పేర్కొన్నారు. ఈ నెల 3 సాయంత్రంలోగా వీటిపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, లేని పక్షంలో ఈ నెల 4న టీజీపీఎస్సీని లక్షమంది నిరుద్యోగులు ముట్టడించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టీజీపీఎస్సీ ముట్టడికి నిరుద్యోగులు ఎలా వెళ్లాలో ఇప్పటికే ప్రణాళికలు సైతం సిద్ధం చేసుకున్నారని చెప్పారు. ఎంతో కాలంగా గ్రంథాలయంలో పుస్తకాలతో పోటీ పడుతూ చదవుతున్న నిరుద్యోగుల ఆశల్లో నీళ్లు చల్లే విధంగా సర్కారు, అధికారులు వ్యవహరించడం తగదని హెచ్చరించారు.